

కార్గోలో 15 కేజీల వెండి మాయం

శంషాబాద్‌రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళ్లాల్సిన 15 కేజీల వెండి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కార్గోలో మాయమైనట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. చెన్నైకి చెందిన కొందరు వ్యాపారులు ఈ నెల 20న హైదరాబాద్‌లో 15 కేజీల వెండి కొనుగోలు చేసి కొరియర్‌లో చెన్నై పంపించేందుకు కన్‌సైన్‌మెంట్ చేశారు. అయితే ఇది అక్కడి వ్యాపారులకు చేరలేదు. దీంతో వారు ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వెండి కొనుగోళ్లు, సరఫరా ఏజెన్సీలపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

యాదవుల సంస్కృతికి ప్రతీక సదర్

» మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు సదర్ సమ్మేళనాలు ప్రతీకగా నిలుస్తాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మహేశ్వరంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా యాదవులు ఏకతాటిపైకి వచ్చి సమ్మేళనాలు జరుపుకొని ఐక్యతను చాటుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దున్నల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సమ్మేళనంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయదవ్, పాండుయాదవ్, అంబయ్యయాదవ్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, పోల్కం బాలయ్య, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, మునగపాటి నవీన్, వెంకటేశ్వర్‌రెడ్డి, కె. ప్రభాకర్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, కాకి ఈశ్వర్, కుమార్, యాదయ్య, శ్రీశైలం, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల పూర్తికి కృషి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా సంచాయి జన భాగదారి పథకంలో ఆయా మండలాల అభివృద్ధికి ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా ఈ పథకంపై ఎంపీవోలు, ఏపీవోలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి పది మ్యాజిక్ సోక్ కిట్స్, కమ్యూనిటీ సోక్ కిట్స్, బోర్‌వెల్ రీచార్జి స్ట్రక్చర్స్, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ పలు నిర్మాణాలకు సంబంధించిన అంచనాలను గత సమావేశంలో ఆదేశించినప్పటికీ కొన్ని మండలాల్లో ఇంకా లక్ష్యాలను అధిగమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకంలో ప్రతి గ్రామంలో సూచించిన విధంగా రెండ్రోజుల్లో అంచనాలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శ్రీలత, అదనపు పీడీ సుభాషిణి తదితరులున్నారు.



మేడిపల్లిలో బస్సులను అడ్డగించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అదనపు బస్సులు నడపాలని ఆందోళన

యాచారం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తి, మేడిపల్లి, కడ్తాల్ మండలంలోని పల్లెచెల్కతండా వరకు ఉదయం, సాయంత్రం వేళ అదనపు బస్సు సర్వీసులు నడపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యాచారం మండలంలోని మేడిపల్లిలో విద్యార్థులు, రైతులు బస్సులను అడ్డగించి ఆందోళనకు దిగారు. తాటిపర్తి నుంచి ఉదయం 8 గంటలకు ఒకటి, 9 గంటలకు ఒకటి బయల్దేరి యాచారం మీదుగా ఇబ్రహీంపట్నం, నగరం వరకు రెండు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ఇబ్రహీంపట్నం నుంచి తాటిపర్తి, పల్లెచెల్కతండా వరకు బస్సులు నడపాలని కోరారు. కాగా, విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పీఆర్‌జీ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ పి.రవీందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల తరలింపు

హుళక్కేనా?

హైకోర్టు తీర్పు.. అధికారుల బేఖాతరు

కాలుష్యకారక పరిశ్రమలను నివాస ప్రాంతాల నుంచి కిలోమీటర్ దూరానికి తరలించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. ఉత్తర్వులు జారీ చేసి ఏడాది పూర్తయినా నేటికీ పరిశ్రమల తరలింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించలేదు. ఫలితంగా షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాయు, జల కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నారు.

కిలోమీటర్ తరలించాలని ఏడాది క్రితం తీర్పు

కాలుష్య పరిశ్రమలతో తప్పని ఇబ్బందులు

భూగర్భ జలాల్లో రసాయన వ్యర్థాలు

వాయు కాలుష్యంతో శ్వాసకోస వ్యాధులు

ఆందోళనలో షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు



షాద్‌నగర్/కేశంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలాల్లో ఆరు కాలుష్యకారక పరిశ్రమలున్నాయి. ఇవి నివాసప్రాంతాలకు అతి సమీపంలోనే ఉన్నాయి. ఈ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో శ్వాసకోస సంబంధిత రోగాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా ఎలికట్ట శివారులోని బింజుసారియా పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో భూగర్భ జలాలు కలుషితమై బోర్లనుంచి నలుపు రంగులో నీళ్లు వస్తున్నాయని సుమారు మూడువేల జనాభాగల సీఎస్‌కే కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యకారక పరిశ్రమల తరలింపులో పీసీబీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

20 ఏళ్ల పాటు వాదనలు

కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామంలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నామని, భుగర్భ జలాలు, వాయు కలుష్యం అవుతుందని, పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందంటూ 2005లో స్థానిక రైతులు ప్రముఖ న్యాయవాది దివంగత తాండ్ర వీరేందర్‌రెడ్డిని కలిశారు. హైకోర్టులో

మిగతా 8వ పేజీలో...



హై కోర్టు ఆదేశాలను అమలుచేయాలి



ఇప్పలపల్లి గ్రామ సమీపంలోని కాలుష్యకారక ఐరన్ పరిశ్రమను తరలించాలని హై కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు అమలు చేయాలి. 2005లో వేసిన కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం జనావాసాలకు కిలోమీటర్ దూరంలో పరిశ్రమలను రీలొకేట్ చేయాలని హై కోర్టు అర్డర్ ఇచ్చింది. అయినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నాం.

- తోట ఆంజనేయులు, ఇప్పలపల్లి మాజీ సర్పంచ్, కేశంపేట మండలం



చిత్తాపూర్-తిప్పాయిగూడ రహదారిలో దిగబడిన ఆర్టీసీ బస్సు

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

» డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

మంచాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో పలుగ్రామాలకు చేరుకునే రహదారులు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. చిత్తాపూర్ - తిప్పాయిగూడ రహదారిపై కాముని చెరువు వద్ద వచ్చే వరదతో రోడ్డు అధ్వానంగా తయారైంది. శుక్రవారం అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు వరద నీటిలో అదుపుతప్పింది. గుంతలోకి దూసుకెళ్లే క్రమంలో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో 15 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

6



శంషాబాద్‌లో భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

మహిళలు, పిల్లల రక్షణకే ‘భరోసా’

» డీజీపీ శివధర్‌రెడ్డి

శంషాబాద్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్న పిల్లలకు రక్షణ కల్పించేందుకే భరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్నామని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని డీసీపీ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని సీఐడీ అడిషిన్ డీజీ చారుసిన్హా, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారిగా 2016లో హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని ప్రారంభించామని, ఇప్పటివరకు ఆరు కమిషనరేట్లు, 24 జిల్లాల్లో 33 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సెంటర్లలో ఉమెన్ వెల్ఫేర్ వింగ్, సొసైటీ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేవలు అందిస్తాయని చెప్పారు. బాధితులకు న్యాయ సలహాలతోపాటు ఆర్థిక భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్రెండ్లీ వాతావరణంలో కౌన్సెలింగ్, వైద్య సహాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ సృజన డీసీపీ డీసీపీ రాజేష్, సీఐలు నరేందర్‌రెడ్డి, రాజేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.

నరసింహకుంటను పరిశీలించిన

హైడ్రా కమిషనర్



శంషాబాద్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానికుల ఫిర్యాదు మేరకు మండల పరిధిలోని పెద్దగోల్కొండ నరసింహ కుంట చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎఫ్‌టీఎల్‌ను కబ్జా చేసి చెరువు ఎత్తు పెంచడం వల్ల చెరువులోని నీరు పెద్దగోల్కొండ ఎగ్జిట్ 15 వద్ద రోడ్లపై భారీగా వరద చేరుతోంది. దీంతో నాగారం, మంచన్‌పల్లి, మహేశ్వరం, పెద్దగోల్కొండ గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పినట్లు నాగారం మాజీ సర్పంచ్ వెంకటేశ్ యాదవ్ తెలిపారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నాం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మాడ్గుల: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మాడ్గుల మండలంలోని అర్కపల్లి గ్రామానికి చెందిన దండు శేఖర్‌కు రూ.2.5 లక్షల విలువైన ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతుందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అనేక విజయాలు సాధించిందని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో రోడ్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రగతిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు కుట్ర రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఉన్నికలో కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, హన్మనాయక్, వెంకటేశ్, బీచ్యనాయక్, సుమన్, మల్లేశ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అంజన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, సురేందర్ రెడ్డి, బాబా, విజయ్ రాథోడ్ ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

షాద్‌నగర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సర్కారు పేద విద్యార్థుల చదులతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లు అవుతుందని, ఇప్పటివరకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,300 కోట్లు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికలపైన ఉన్న శ్రద్ధ విద్యార్థులపైన లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బాకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



పాడి రైతులతో మాట్లాడుతున్న మధుసూదన్

పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

» పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి మధుసూదన్

మంచాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు సోకకుండా పాడి పశువులకు జాగ్రత్తగా చూసుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ మధుసూదన్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బండలేమూర్, చిత్తాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల వరదలతో దెబ్బతిన్న పశుగ్రాసం వివరాలను తెలుసుకున్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఆయనవెంట పశు వైద్యాధికారులు డాక్టర్ వనజాకుమారి, డాక్టర్ సుధ, సిబ్బంది మల్లీశ్వరి, మల్లేష్, శ్రీను, శివరాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 2కే రన్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు పాల్గొన్నారు. భారత తొలి హోంమంత్రిగా పటేల్ 1947 స్వాతంత్ర్యనంతరం అనేక సంస్థానాలను విలీనం చేశారని గుర్తు చేశారు. తెలంగాణలో పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా ఉందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ ఎం.మహేందర్‌రెడ్డి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



రన్‌లో డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు

పెరటి కోళ్ల పంపిణీ

బషీరాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీళ్లపల్లి, ఎక్మాయి గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి ఆధ్వర్యంలో పెరటి కోళ్లను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా 80మంది సభ్యులకు 1500కోళ్లు అందజేసినట్లు ఏపీఎం పద్మారావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సీసీలు కవిత, సేవ్యానాయక్, హంపయ్య, సుల్తానా, కృష్ణ, జగదీశ్, కల్పన పాల్గొన్నారు.


పెరటి కోళ్ల పంపిణీలో జానకి

రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం పరిడవిల్లుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని క్యాంపు కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే పార్టీ రాజ్యమేలుతుందని, త్వరలోనే ఆ పార్టీకి చరమగీతం పాడబోతున్నామన్నారు. అలాగే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన క్యాంపు కార్యాలయంలో కొత్తూరు,నందిగామ, కేశంపేట మండలాలకు చెందిన 58మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.23.24 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.


ఇందిరాగాంధీ, పటేల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అందుబాటులో లిమ్స్ అంబులెన్స్ సేవలు

లిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం సమకూర్చిన అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అంబులెన్స్ వాహనాలను ఆయన ప్రారంభించి వివిధ మండలాల బాధ్యులకు అప్పగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 108 అంబులెన్స్ వాహనాలకు తోడు లిమ్స్ వాహనాలు కూడా అత్యవసర సేవలను అందిస్తాయని చెప్పారు. శుక్రవారం నుంచే సేవలు అందిస్తాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్, నాయకులు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, బాలరాజు గౌడ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు నడుపుతుండగా గుండెపోటు

● ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి


కొండ హరినాథ్‌రెడ్డి (ఫైల్)

కొత్తూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. డ్రైవింగ్ చేస్తుండగా గుండెనొప్పి రావడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయ బోర్డుకు ఢీకొన్నది. దాంతో కారు నడుపుతున్న వ్యక్తిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూర్ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు పెంజర్ల చౌరస్తా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నర్సయ్య కథనం ప్రకారం.. నందిగామ మండలం మేకగూడ గ్రామ శివారులో గల హిమాక్షి బేకరీ కంపెనీలో కొండ హరినాథ్‌రెడ్డి(56) మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నార్సింగ్ మంచిరేవుల సమీపంలో గల సైబర్ హోమ్స్ లేక్ విజన్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రతీరోజు కారులో విధులకు వెళ్లి వస్తుంటాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం విధులకు హరినాథ్‌రెడ్డి తన స్విఫ్ట్ కారులో వస్తుండగా పెంజర్ల చౌరస్తా వద్ద గుండెనొప్పి రావడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయ బోర్డుకు ఢీకొని నిలిచిపోయింది. గమనించిన స్థానికులు అతడిని గుర్తించి పరిశ్రమ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, మృతుడి ఇద్దరు పిల్లలు అమెరికాలో ఉండగా, అతని భార్య ఇటీవల అమెరికా వెళ్లింది. హరినాథ్‌రెడ్డి కూడా వచ్చే నెలలో అమెరికాకు వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే మృత్యువు అతడిని వెంటాడింది. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. హరినాథ్‌రెడ్డి బంధువు మురళీమోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు.

'కపాస్' లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

యాలాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్‌తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయాలంటే కేంద్ర తీసుకువచ్చిన ఈయాప్‌లో రైతు పంట తదితర వివరాలు నమోదు చేయాలని, అలా నమోదు చేసుకుంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేయమనే నిబంధన సరైంది కాదన్నారు. వ్యవసాయాధికారి ఇచ్చే టోకన్ ద్వారా పత్తి కొనుగోలు చేసేవిధంగా జిల్లా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో వీలైనన్ని ఎక్కువ చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలనిడిమాండ్ చేశారు.

'అక్రమ కేసులకు భయపడం'

వికారాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అక్రమ కేసులకుభయపడమని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆయన శుక్రవారం కేసు విచారణలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలన గాలికి వదిలేసిందని విమర్శించారు. మాజీ సీఎంపై సీబీఐ విచారణ ఆదేశించడంతో వికారాబాద్‌లో నిరసనగా చేపట్టగా కాంగ్రెస్ సర్కార్ అక్రమ కేసు పెట్టినట్లు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతుంటామని తెలిపారు.

'మొక్కజొన్న'లో అధిక దిగుబడి సాధించాలి

కేశంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మొక్కజొన్న పంట సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మొక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సుశీల, డాక్టర్ బీమల్లయ్య, డాక్టర్ అనూషలు సూచించారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి రైతువేదికలో శుక్రవారం ఎస్టీ సబ్‌ప్లాన్ పథకం కింద దేవునిగుడి తండాకు చెందిన 30 మంది రైతులకు వారు టార్పాలిన్లు, లింగాకర్షణ బుట్టలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఇప్పలపల్లి క్లస్టర్ ఏఈవో రాజేశ్వరి రైతులు పాల్గొన్నారు.


రైతులకు టార్పాలిన్లు అందిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

● చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి, దివంగత ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఆమె వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తా వద్ద విగ్రహానికి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్లు వెంకట్‌రెడ్డి. ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బండారు శైలజా ఆగిరెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, ఆర్.మధుసూదన్ గుప్తా, పలుగుట్ట నర్సింలు, మాజీ ఎంపీటీసీ రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

నాగేంద్రప్ప సేవలు ఆదర్శనీయం

ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రప్ప సేవలు పోలీస్ శాఖకు ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నాగేంద్రప్పను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..నాగేంద్రప్ప భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో సుఖ శాంతులతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. రాములు, ఏఓ ఖాజా మొహియుద్దీన్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, ఆర్ఐ డేవిడ్, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


నాగేంద్రప్పను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

రికార్డు అసిస్టెంట్ ఉద్యోగ విరమణ

మేడ్చల్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ రహ్మత్ అలీ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేస్తూ పలువురు కొనియాడారు. డీపీఆర్‌వో స్వర్ణలత, డిప్యూటీ ఈఐఈ పలువురు షేక్‌రహ్మత్‌ను పూలు, శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో డీపీఆర్‌వో సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు, పాత్రికేయులు, షేక్‌రహ్మత్ కుటుంబసభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.


షేక్ రహ్మత్ అలీని సన్మానిస్తున్న సిబ్బంది

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీకి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారంలో పలు అభివృద్ధి పనులకు రూ.12.5కోట్లనిధులు కేటాయించాలని హెచ్ఎండీఏ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, హెచ్ఎం డీవోడీఈ సత్యప్రసాద్, ఏఈ వెంకటేష్, మున్సిపల్ డీఈ మహిపాల్, బద్దం కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

తాండూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి ఆలయంలో శుక్రవారం బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించారు. యజ్ఞ యాగంలో తాండూరుకు చెందిన శంకర్ యాదవ్ చంద్రకళ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోగోపాల్, పూజారి పాండు, హన్మయ్య, కోహిర్ రాజు, మనోహర్ పాల్గొన్నారు.


బీరప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో ప్రతీ ఏడాది నిర్వహించే శ్రీ విఠలేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని నిర్మించిన ధర్మదాత మహంత్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉత్సవాల్లో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఆలయానికి 18 ఎకరాల 26 గుంటల భూమిని విరాళంగా అందించిన మహనీయుడు మమహంత్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మదాత కుటుంబసభ్యులు బొర్ర శ్రీనివాస్‌రెడ్డి, బొర్రా సుష్మారెడ్డి, గురుచరణం, ఆమ్రాది రామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్, బిచ్చన్న, రాజు, ప్రభాకర్, సంతోష్ పాల్గొన్నారు.


శ్రీ విఠలేశ్వరస్వామి ఆలయంలో మహంత్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి

బీజాపూర్ హైవే విస్తరణకు మోక్షం

- చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి
- నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి గ్రీన్ ట్రిబ్యునల్ ఆమోదం

చేవెళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు అనుకులంగా రావడం హర్షనీయమని చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు(చెన్నెయ్)లో శుక్రవారం ఉదయం విచారణపై తుది వాదనలు పూర్తయ్యాయని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు వెంటనే కొనసాగించవచ్చని ఆదేశించిందని స్పష్టం చేశారు. కోర్టులో కేసు వేసిన ప్రణయ్‌రావు, తేజ, బాలాంత్రపులతో ప్రభుత్వం చర్చలు జరపడంతోనే వారు కేసును విత్‌డ్రా చేసుకున్నారని చెప్పారు. కోర్టు తీర్పు రావడంతో రోడ్డు పనులు వేగవంతంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రమే రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.900 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రోడ్డు పనులు పూర్తయితే రాజేంద్రనగర్, చేవెళ్ల, పరిగి, తాండూర్, వికారాబాద్, కొండగల్ నియోజకవర్గాలతోపాటు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యేలను సన్మానించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపాల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, షైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, నర్సింలు, ప్రభాకర్, శ్రీనివాస్, మహేందర్, తాజొద్దీన్ తదితరులు ఉన్నారు.

పంట మార్పిడిపై అవగాహన

శంషాబాద్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం విద్యార్థులు శుక్రవారం శంషాబాద్ మండలంలోని బహదూర్‌గూడలో పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అధిక దిగుబడి పొందేందుకు పంట మార్పిడి ఎంతగానో ఉపయోగపడుతుందని ఉంటుందని వివరించారు. ప్రతీ సంవత్సరం రైతులు పంట మార్పిడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు గంగోత్రి, హరిక, స్నేహ, దివ్య, మౌనిక, నవ్య, వర్షిత, హరిక తదితరులు పాల్గొన్నారు.



పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తున్న విశ్వవిద్యాలయం విద్యార్థులు

రేగొండితో అజ్జుబాయ్ అనుబంధం

తాండూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తాండూరుతో ప్రత్యేక అనుబంధం ఉంది. అజారుద్దీన్ మేనమామ పెద్దేముల్ మండలం రేగొండిలో నివాసం ఉంటున్నారు. అయితే 19970లోనే అజారుద్దీన్ ఈ ప్రాంతంలో బంధువులతో కలిసి వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేశారు. వ్యవసాయం, పశువులు అంటే ఎంతో ఇష్టమున్న అజారుద్దీన్ ఇక్కడ పొలంలో బంధువులతో వ్యవసాయం సాగు చేయిస్తూ ఇక్కడ పశువులను కూడా వ్యవసాయ క్షేత్రంలో పెంచి పోషిస్తున్నారు. సెలవు దినాల్లో తరుచుగా



పెద్దేముల్ ఎఫ్ఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో అజారుద్దీన్



బంధువులు, ఆప్తులతో అజారుద్దీన్

వచ్చే అజారుద్దీన్ రేగొండి గ్రామంలో బంధువులు, ఆప్తులతో కలిసి పోతారు. వారి సమీప బంధువు హైదర్ రేగొండి సర్పంచ్‌గా కూడా పని చేశారు. ఈ ప్రాంత ప్రజలు అజారుద్దీన్‌ను గౌరవంగా అజ్జుబాయ్ అని పిలుపుచుకుంటారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో రేగొండి గ్రామ ప్రజలే కాకుండా తాండూరు ప్రాంత ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ముస్లిం మహిళలకు కుట్టు మెషీన్లు అందిస్తున్న వెంకట్‌రాంరెడ్డి, శమంత ప్రభాకర్‌రెడ్డి అఫ్జల్‌బేగ్

కందుకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందని, ఇందిరమ్మ మహిళా శక్తి-రేవంత్ అన్న భరోసా కార్యక్రమం మహిళలకు ఎంతో మేలు చేస్తుందని మండల సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డిలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మహిళలకు మంజూరు చేసిన కుట్టు మెషీన్లను శుక్రవారం కొత్తగూడలోని రైతు వేదికలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్‌తో కలిసి వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు పాండురంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ డైరెక్టర్లు యుగేందర్, ప్రశాంత్‌కుమార్, అంకగళ్ల పుష్ప, ఎండీ సులేమాన్, సురేశ్, దర్శన్, జి.సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, ఎండీ మొయినుద్దీన్, శేఖర్, మహేందర్, అజీజ్, గాదెకుమార్, నరసింహ, మహేష్, అజారుద్దీన్, మొయినుద్దీన్, మున్వర్, పాషా, అలీ, ఆసిఫ్, ఎండీ ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ మరిచారా?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోడ్ అమలులో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నేతలు ముస్లింల ఓట్ల కోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడం ఏమిటని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు మండల పరిధిలోని ముస్లిం మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులకు హిందూ మహిళలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



ముఖ్య కార్యకర్తలతో బుట్టి బాల్‌రాజ్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

కందుకూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉందని ఆ పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దెబ్బడగూడ గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దెబ్బడగూడలో శ్మశానవాటిక లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కందుకూరు గ్రామం నుంచి దెబ్బడగూడ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ పార్టీ నాయకులు ఆర్.చందు, సతీష్, రాజశేఖర్, ఎస్.కృష్ణ, ఎస్.సుధాకర్, బి.ప్రభాకర్, రాములు, ఆర్.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



మల్కారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్మన్ ప్రభుసాగర్

రైతుల మేలుకే మద్దతు ధర

శంషాబాద్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయడానికే ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మల్కారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నూతన గోదాంల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మల్కారం పీఏసీఎస్ చైర్మన్ మేకల ప్రభుసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తున్నామని చెప్పారు. త్వరలోనే గోదాంల నిర్మాణాలు కూడా పూర్తి చేస్తామని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, సీనియర్ నాయకులు నీరటి రాజు, వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఇస్తారి, రామాంజాపూర్ మాజీ సర్పంచ్ అరుణ ప్రభుసాగర్, శివాజీ, గోపాల్, సీఎస్‌సీఎస్ డైరెక్టర్లు, ఏవో శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



బొంరాస్‌పేట్ పెద్దచెరువులో చేపపిల్లలను వదులుతున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన ఉచిత చేప పిల్లలను శుక్రవారం బొంరాస్‌పేట్ పెద్ద చెరువులో వదిలిపెట్టారు. మండల వ్యాప్తంగా 52 చెరువుల్లో 10లక్షల 3వేల చేపపిల్లలను మత్స్యకారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకటయ్య, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, దేశ్యనాయక్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు పరామర్శ

కేశంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును శుక్రవారం కేశంపేట మండల మలిదశ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లెంకపోతుల కుమార్‌గౌడ్, మామిడి యాదయ్యగౌడ్, కృష్ణలు పరామర్శించారు. హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వెళ్లి ఆయన తండ్రి, దివంగత సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పంజలి ఘటించి నివాళులర్పించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మంజూరు పత్రాలను అందజేస్తున్న బొక్క బాలకృష్ణారెడ్డి

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్యజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కనకమామిడిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, గ్రామాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ గ్రామ్యాక్షుడు కురుమ రాములు, వంశీధర్‌రెడ్డి, భాస్కర్, వనజ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వ పరిహారం

దౌల్తాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బోడి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్రావ్ అన్నారు. మండలంలోని రావుల్‌పల్లి రోడ్డు నుంచి దౌల్తాబాద్ మండల కేంద్రానికి నాలుగులైన్‌ల రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులు మార్కింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరన్న, జాకీర్, మహిపాల్, మంజుల, దస్తప్ప, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కారక కంపెనీని మూసివేయాలి

- పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం వద్ద అంతారం గ్రామస్తులు, రైతులు

చేవెళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్న పరిశ్రమను వెంటనే తొలగించాలని అంతారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని కాలుష్య నియంత్రణ మండలి బోర్డు(పీసీబీ) కార్యాలయంలో అధికారులను కలిసి కంపెనీని మూసివేయాలని గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మెరైన్ ఫుడ్స్ అండ్ ఫీడ్స్ పరిశ్రమను ప్రభుత్వం వెంటనే మూసివేయాలని తెలిపారు. గ్రామంలో పర్యావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని వాపోయారు. కంపెనీ పరిసరాల్లో ఉన్న పంట పొలాల్లో పని చేస్తున్న రైతులు నిత్యం దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూరగాయల పంటలపైనా కాలుష్య ప్రభావం ఉంటోందని తెలిపారు. కంపెనీని మూసివేయాలని పలువురు గ్రామస్తులు, యువకులు ఆందోళన చేస్తే కంపెనీ యాజమాన్యం కేసులు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్న కంపెనీని మూసివేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాజ్యాధికారంతోనే బీసీల సాధికారత



రిలే నిరహార దీక్షలో బీసీ నాయకులు

షాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బీసీల సాధికారత రాజ్యాధికారంతోనే సాధ్యమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష శుక్రవారంతో 20వ రోజుకు చేరింది. షాబాద్ మండల వృద్ధాప్య సంఘం నాయకులు పాల్గొన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక



సాయిబాబాను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న మహిళా కార్మికులు

కొత్తూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ కన్వీనింగ్ కన్వీనర్‌గా బీసా సాయిబాబాను వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజన మహిళా కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాయిబాబాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికుల కోసం నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ అని అన్నారు. నూతన కమిటీలో 16మంది సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యులుగా జయమ్మ, అరుంధతి, జ్యోతి, అనిత, సుజాత, వసంత జంగీర్‌బీ, మంజుల, నవనీత, లత, లక్ష్మణ్, పెంటమ్మ, ఫరిదాబేగం, జంగమ్మ, యాదయమ్మ, బాలకృష్ణలను ఎన్నుకున్నారు.

అంకిత భావంతో పనిచేయాలి



ఎంపీడీవో సృజన సాహిత్యను సన్మానిస్తున్న ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్

మోమిన్‌పేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో పని చేయాలని ఎంపీడీవో సృజన సాహిత్య సూచించారు. మండలంలోని కేసారం గ్రామంలో గ్రామ పంచాయతీ, పాఠశాల, నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. పంచాయతీ అభివృద్ధి పనులు, రికార్డులు, పారిశుధ్య పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శంకరయ్య, ఉపాధిహామీ సిబ్బంది వెంకటేశం పాల్గొన్నారు. అదేవిధంగా మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు యూడైస్ ఫార్మాట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవోను ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు.

లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న కొడంగల్‌లోని మహదేవ శివాయంలో నిర్వహించే లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం వీరశైవ సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం ఐదుగురు అర్చకులతో స్వామివారికి రుద్రాభిషేకంతో ఆలయ ఆవరణలో అంతూరు, బెంతూరు, పాటిమీదిపల్లి మఠాధిపతి శ్రీరాచోటీశ్వర స్వామివారి ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన, కార్తీక దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంఘం సభ్యులు గడ్డం చంద్రశేఖర్, సర్వేశ్వర్, రవి, సురారం రాకేశ్, వివిధ సంఘాల సభ్యులు భానుప్రకాశ్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



ఆమనగల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎల్లికట్ల గ్రామంలో వన్ మెడి సంస్థ సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవంబరు 2న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిజైన్, ఇన్నోవేషన్‌కు కట్టుబడిన ఏఐసీటీఈ

శంషాబాద్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డిజైన్, ఇన్నోవేషన్‌కు ఏఐసీటీఈ కట్టుబడి ఉందని ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారామ్ అన్నారు. శుక్రవారం బూట్ క్యాంప్‌ను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. శుక్రవారం ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై రెండు రోజుల సామర్థ్యాభివద్ధి వర్క్‌షాప్‌ను శంషాబాద్ సమీపంలోని వర్ధమాన్ కళాశాలలో ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూట్ క్యాంప్‌ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ, ఎన్‌సీఈఆర్‌టీ, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్, వాద్వాని ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్, ఏఐసీటీఈ ప్రతినిధులు షేక్ వసీం, రాజేశ్ కందుల, వాద్వాని ఫౌండేషన్ రవీంద్ర, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ఘట్‌కేసర్/తాండూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆసంఘం రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర అన్నారు. ఘట్‌కేసర్‌లోని అవుటర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, శ్రీను, సతీష్, విజయ్, యాదమ్మ, బసవయ్య, యాకేష్, స్వాతి, యాదగిరి, రాజేష్ పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరులోని సీసీఐ కర్మాగారం మెయిన్ గేటు దగ్గర ఏఐటీయూసీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ విచ్చేసి మద్దతు తెలిపారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కొర్లకుంట వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగులో జాగ్రత్తలు పాటించాలి

షాబాద్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురిసిన వర్షాలకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి దండెం విజయచంద్ర అన్నారు. శుక్రవారం షాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వరి పంటకు పొలం మడుల్లో నీరు నిల్వ ఉంచకుండా వచ్చిన వరద వచ్చినట్లు కాలువల ద్వారా బయటకు పంపాలని, నేలవాలన వరి కంకులు నీటిలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు ఏమైనా సందేహాలుంటే షాబాద్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చౌదరిగూడ : మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం మండల పరిధిలోని ఎల్కగూడ, పద్మారం, పెద్దఎల్కిచర్ల, గాలిగూడ, చెగిరెడ్డి ఘణాపూర్ తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారులు ఏఈవోలు గౌరిప్రియ, స్వాతిలు పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలో 25 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. మిగతా గ్రామాల్లో పంటలను గ్రామాలవారిగా పర్యటించి వివరాలనుసేకరించనున్నట్లు వారు తెలిపారు.



చౌదరిగూడ : ఎల్కగూడలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఈవో స్వాతి

షాద్‌నగర్ రూరల్ : జిల్లా వ్యవసాయ అధికారి ఉష ఆదేశానుసారం మండల వ్యవసాయాధికారులను అదేశించారు. దాంతో అధికారులు పంటల నమోదు ప్రక్రియ చేపట్టారు. మండలంలోని బూర్గుల, కిషన్‌నగర్, గంట్లవెల్లి, మొగిలిగిద్ద, తిమ్మాజిపల్లి, ఎలికట్ట గ్రామాల్లో పంటల నష్టం వివరాలు సేకరించినట్లు వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



కొత్తూర్ : తిమ్మాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్ఫూర్తి

కొత్తూర్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల, మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో దాదాపు నాలుగు వందల పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. మాజీ సర్పంచ్ ఏనుగు జనార్ధన్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది కృష్ణస్వరూప్, రవి, రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

షాబాద్ : పాడిరైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. ఆస్పల్లిగూడ, లింగారెడ్డిగూడలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. సిబ్బంది, రైతులున్నారు.

పరిశ్రమల తరలింపు హుళక్కేనా?

(ఐదో పేజీ తరువాయి)

రిట్‌పిటిషన్ నంబరు 2951/2005 దాఖలు చేశారు. ఈ అంశంపై సుమారు 20 ఏళ్లపాటు హైకోర్టులో వాదనలు జరిగాయి. కాలుష్య పరిశ్రమలకు సంబంధించి ఇరుపక్షాల వాదనలు విన్న అప్పటి హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరధే జనావాసాల మధ్య ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఊరికి కిలో మీటర్ దూరంలో ఏర్పాటు చేసుకోవాలంటూ గతేడాది సెప్టెంబరు 9న తీర్పు ఇచ్చారు. అలాగే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఏడాది గడువు ఇచ్చారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థలాన్ని చూపాలంటూ ఆదేశించారు. ఇదే విషయాన్ని గతంలో చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా కాలుష్యమండలిని ఆదేశించింది. కానీ, ఇప్పటివరకు పీసీబీ అధికారులు నివాసప్రాంతాల మధ్య ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను తొలగించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వస్తున్నాయి.



కలుషిత నీటిని చూపుతున్న సీఎస్‌కే కాలనీ వాసులు(ఫైల్)

పంటలు దెబ్బతింటున్నాయి



ఐరన్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పంటలకు నష్టం వస్తోంది. పరిశ్రమల నుంచి వస్తున్న దట్టమైన పొగతో మామిడి, జామ, మిర్చి, టమాట పంటలు దెబ్బతింటున్నాయి. స్పాంజ్ ఐరన్ పరిశ్రమలతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి. పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయి. కాలుష్య కారక పరిశ్రమలను తరలించాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- అరుంధతి, మహిళా రైతు ఇప్పలపల్లి

క్రైం కార్నర్

తెగిన విద్యుత్ వైరు

త్రుటిలో తప్పిన ప్రమాదం
టిప్పర్ తాకడంతో ఘటన..

చౌదరిగూడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): టిప్పర్ విద్యుత్ వైరుకు తాకడంతో తెగిపడింది. కాగా, ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని రావిర్యాల గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద కొందుర్గు నుంచి రావిర్యాల వైపు వస్తున్న టిప్పర్ వాహనం వేగంగా రావడంతో విద్యుత్ వైర్‌కు తగిలింది. దాంతో అది కిందపడింది. కాగా, ఎలాంటి పెను ప్రమాదం చోటుచేసుకోలేదు.



ఎన్నికల ప్రచారంలో సాయిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్‌కు అన్ని వర్గాల మద్దతు

ఆమనగల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అన్నివర్గాల మద్దతు లభిస్తుందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాడ్గుల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్ రెడ్డిలు అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయ సోపానమన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసఫ్‌గూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఉప ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. ఓటమిని గ్రహించిన విపక్షాలు ఉనికి కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు మండ్లీ రాములు, గుర్రం కేశవులు, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, కాసు శ్రీనివాస్‌రెడ్డి, టీక్య నాయక్, ప్రసాద్, బీచ్యనాయక్, రమేశ్ గౌడ్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ప్రజల్లో కీర్తి

ఆమనగల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పనితీరు, సేవలను బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని ఎంపీడీవో మాధురి అన్నారు. ఆమనగల్లు ఎంపీవోగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న వినోదకు శుక్రవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాధురి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినోద-రంగారెడ్డి దంపతులను మండల పరిషత్ సిబ్బందితో కలిసి ఎంపీడీవో శాలువాలతో సత్కరించారు.

సర్దార్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



చేవెళ్ల : పటేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కేఎస్ రత్నం, నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో 550 చిన్న చిన్న రాజ్యాలను సర్దార్ పటేల్ ఏకతాటిపై తీసుకువచ్చిన మహనీయుడని, ఆయన్ను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎ.అనంతరెడ్డి, జిల్లా యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, శ్రీకాంత్, బాలయ్య, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, అభిషేక్ రెడ్డి, వెంకటేశ్, జైసింహారెడ్డి, పురుషోత్తం రెడ్డి, దామోదర్‌చారి తదితరులున్నారు.

కందుకూరు : దేశ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతగా తీసుకోవాలని సీఐ సీతారాం అన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో విద్యామయి జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సుమారు వంద మంది విద్యార్థులతో కలిసి రన్‌ఫర్‌యూనిటీ నిర్వహించగా ఎస్ఐలు పరమేష్, మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

యాచారం : సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా యాచారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, పోలీసులు జాతీయ ఐక్యతా దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువత ఉన్నత చదువులు చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రుల శ్రమకు గుర్తింపు తేవాలన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. పటేల్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్సైలు సత్యనారాయణ, ప్రియాంక తదితరులు ఉన్నారు.



కందుకూరు : విద్యార్థులతో కలిసి రన్‌ఫర్ యూనిటీలో పాల్గొన్న సీఐ సీతారాం



యాచారం : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నరేశ్‌కు 'పీహెచ్‌డీ' ప్రదానం

ఆదిభట్ల/మంచాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మంచాల మండలం చెన్నారెడ్డిగూడకు చెందిన రైతు బిడ్డ గ్యార నరేశ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. గ్రామానికి చెందిన గ్యార ఎల్లమ్మ, ఎల్లయ్య దంపతుల కుమారుడు నరేశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంటెక్‌లో ప్రవేశం పొందాడు. ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఇ.విద్యాసాగర్ పర్యవేక్షణలో డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ లాసెస్ మినిమైజ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేశాడు. ఈమేరకు నరేశ్ థీసిస్‌ను ఓయూ ప్రొఫెసర్లకు అందజేయడంతో డాక్టరేట్ ప్రదానం చేశారు.



ప్రొఫెసర్లకు పరిశోధన గ్రంథం ఇస్తున్న నరేశ్

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



ఆమనగల్లు : ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు మరువలేనివని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ అన్నారు. ఆమనగల్లులో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, మండలాధ్యక్షుడు జగన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ హాజరై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కాలే మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్, సురేశ్, అలీం, వెంకటేశ్, నాజర్, శేఖర్, కుమార్ గౌడ్, సురేశ్ నాయక్, షాబోద్దీన్, తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి నాయకులతో కలిసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు యాదయ్య, సురేందర్ రెడ్డి, జంగయ్య, శేఖర్, రమేశ్, తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి క్యామ రాజేశ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బోసు రవిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇమ్రాన్‌బాబా, భానుకిరణ్, శివానంద్, సందీప్, చంద్రశేఖర్, శ్రీకాంత్, నరేశ్, తదితరులు న్నారు. కాగా, కల్వకుర్తి మాజీ చల్లా వంశీచంద్ రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంచాల : నాయకులు ఇందిరాగాంధీ వర్ధంతిని మండల పరిధిలో జరుపుకున్నారు. ఆరుట్లలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి, కావలి బుగ్గరాములు, సాదిరి ఎల్లేష్, జెనిగె వెంకటేష్ యాదవ్, కావలి శ్రీనివాస్, చీమల జంగయ్యయాదవ్, మారగోని మానయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : దేశానికి ఇందిరమ్మ చేసిన సేవలు చిరస్మరణీయమని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. షాబాద్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశోక్, సర్దార్ నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, గౌరీశ్వర్, రాఘవేందర్, శ్రీనివాస్, రమేష్, అంజనేయులు, కిషోర్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కావలి చంద్రశేఖర్, నాయకులు



మంచాల : నివాళులర్పిస్తున్న హన్మంత్‌రెడ్డి తదితరులు

కార్మిక హక్కుల సాధనే లక్ష్యం



మహేశ్వరం : సమావేశంలో మాట్లాడుతున్న దత్తునాయక్

మహేశ్వరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికులు, కర్షకుల హక్కుల సాధనతో పాటు వారి కష్టసుఖాల్లో పాలు పంచుకునేది ఒక్క ఏఐటీయూసీ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి. దత్తునాయక్ అన్నారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మంఖాల్ పారిశ్రామిక వాడలో కార్మికులతో కలిసి ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాలకు పైగా కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నది ఒక్క ఏఐటీయూసీ మాత్రమే అన్నారు. నాయకులు రాజు, దేవేందర్, యాదగిరి, బ్రహ్మచారి, శివ, నరసింహ, సాయి, కిషోర్, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రం శుక్రవారం ఏఐటీయూసీ 106 ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు హాజరై ప్రసంగించారు. ఏఐటీయూసీ 1920 సంవత్సరం అక్టోబరు 31న ఆవిర్భవించిందని తెలిపారు. ఆనాటి నుంచి కార్మికులకు కష్టజీవులకు ఏఐటీయూసీ అండగా నిలుస్తూ దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉందన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల జీతాలు పెంచాలన్నారు. అన్నెపు ప్రభు, జి.రాజు, నరేష్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.



శంషాబాద్ : ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలో నాయకులు, కార్మికులు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక సన్నాహక సమావేశంలో రాము పాల్గొన్నారు. ఈనెల 12న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించనున్న డ్రగ్స్ వద్దు, మన భవిష్యత్తు ముద్దు అనే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు నిర్వాహకులతో కలిసి విడుదల చేశారు. తెలంగాణ యూనియన్ ఫిలిం డాన్సర్ ప్రభుశంకర్, టీఎస్ఎస్‌వో రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి మీసాల చిక్కి (బాల వర్షిత్), బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుమ్మకొండ రాజు, పస్పుల సురేశ్, మీసాల గోపాల్, పస్పుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైన్‌షాపును జనావాసాలకు దూరంగా తరలించండి

కేశంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న వైన్ షాపును జనావాసాల నుంచి దూరంగా తరలించాలని బీజేపీ యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి శివాజీ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ రోడ్డు వైపు జనావాసాల మధ్య ఉన్న వైన్ షాపుతో కాలనీలోకి వెళ్లాలంటే మహిళలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని, మద్యం సేవించి ఎక్కడపడితే అక్కడ మందుబాబులు మూత్రవిసర్జన చేస్తున్నారని, ఇష్టారీతిన వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. కాలనీలోకి వాహనాలు తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి వైన్‌షాపును దూరంగా తరలించాలన్నారు.

జంగారెడ్డి దశదిన కర్మకు హాజరైన మంచిరెడ్డి



జంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుర్కగూడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు బుచ్చిరెడ్డి తండ్రి జంగారెడ్డి దశదినకర్మ శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి కార్డెన్స్‌లో జరిగింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, బూడిద రామ్‌రెడ్డిపాటు పలు పార్టీల నాయకులు జంగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్‌లో మైనార్టీలకు సముచిత స్థానం

కడ్తాల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని ఆ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు జహంగీర్‌బాబా అన్నారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ క్రికెటర్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు అజారుద్దీన్‌కి రాష్ట్ర కేబినెట్‌లో చోటు కల్పించడం పట్ల జహంగీర్ బాబా హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, అజారుద్దీన్ మంత్రివర్గంలో చోటు కల్పించడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

ఘనంగా ఉప్పల అఖిల్ జన్మదిన వేడుకలు



అఖిల్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్, లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ ఉప్పల అఖిల్ జన్మదిన వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ సబ్ సెంటర్ వద్ద డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేడుకలకు ఉప్పల ట్రస్ట్ సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వెంకటేశ్, లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి అఖిల్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, రామకృష్ణ, వీరేశ్, సాయి, వీరేంద్ర, గంప శ్రీనివాస్, ఇర్షద్, కృష్ణ, సురేశ్, మహేశ్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.